


# వార్ధక్యం


కొలువ మల్లయ్య

ఏడు పదుల వయోభారాన్ని మోస్తున్న బలరామయ్య కొడుకెదురు చూస్తున్నాడు. మూడు రోజులుగా కళ్ళలో వత్తులేసుకొని ఎదురు చూస్తున్నాడు. మంచంలో అసహనంగా అటూ ఇటూ కదుల్తున్నాడు. అతికష్టంగా లేచి కూర్చుంటున్నాడు. కట్టె పట్టుకొని భారంగా అడుగులేస్తూ బజారు వరకు వెళ్ళి చూసి వస్తున్నాడు. కొడుకుపై ప్రేమతో పేగు బొర్లుతుంటే,

నిస్సహాయంగా నిట్టూరుస్తున్నాడు.

'తానింకా ఎక్కువ కాలం బతుకలేడు. కొన్ని రోజుల్లోనో, మహా అయితే నెలల్లోనో తానీ లోకం నుంచి విశ్రాంతి కోరుకోబోతున్నాడు. తాను మృత్యువుకు దగ్గరవుతున్నకొద్దీ కొడుకును దగ్గరకు తీసుకోవాలనిపిస్తుంది. హృదయానికి హత్తుకోవాలనిపిస్తుంది. కాని, కొడుకొస్తాడా? వచ్చినా తనతో వుంటాడా? ఈ వృద్ధాప్యంలో తన భారాన్ని మోస్తాడా? వస్తే బాగుండును? మంచంలో వెల్లకిలా పడుకొని తిరుగుతున్న ఫ్యాన్ కేసి చూస్తూ తనలోతానే గొణుక్కుంటున్నట్టను కుంటున్నాడు బలరామయ్య.

"ఏమేవ్! సురేషొచ్చిందా?' మంచంలో కూర్చొని మంచంలో కూర్చొని భార్యను కేకేస్తూ అన్నాడు బలరామయ్య. భర్త కేక విని మెల్లమెల్లగా నడుస్తూ ఆ గదిలో కొచ్చింది రాజమ్మ. అరవై దాటిన




ఆమెనూ వృద్ధాప్యం క్రుంగదీస్తుంది. వయసు ప్రభావం ఆమెపై స్పష్టంగా కనబడుతుంది.

"ఎందుకంతగా కేకలు వేయడం? ప్రొద్దుట్నుంచి ఈ నాలుగైదు గంటల్లో పది పన్నెండు సార్లడి గారు. వాడొస్తే దాక్కుంటాడా? మీ చాదస్తం కాకుంటే? వచ్చాడా అని పదే పదే అడిగితే, ఎదురుచూపులు చూస్తే ఒజీట్లోకెళ్ళి, చూసొస్తే వాడొస్తాడా? అయినా వాడెందుకొస్తాడు? అద్దాల నాడు బిడ్డలు కాని గద్దాలనాడా?" అంది రాజమ్మ. కొడుకొస్తే బాగుండునని ఆమె కూడా మనసులో అనుకుంటూనే వుంది. పైకి మాత్రం గంభీరంగా కనబడుతుంది.

"అయితే సురేష్ రాడంటావా?" ముగ్గుబుట్టలా వున్న తలను గోక్కుంటూ అన్నాడు బలరామయ్య.

"వస్తే వస్తాడు లేకుంటే లేదు. పదే పదే నన్ను విసిగించడమెందుకు? వాడు రాకుంటే నేనేం జెయ్యాలి?"

"గడ్డి పీకాలి" గట్టిగా అని భార్యమీదికి కళ్ళెర్ర జేసాడు బలరామయ్య.

"అదేదో సామెత చెప్పినట్టుంది. అన్నిటికీ నేను ఎదురుగా కనబడ్తున్నాను మీకు. ఏమన్నంటే నా మీదికి లేవడం, బూతులు కక్కడం. నేనేం జెయ్యాలె చావన్నా? అర్వై దాటితే అవగుణంలో పడ్తారంటారు. అలా వుంది మీ సంగతి. అన్నీ చిన్న పిల్లల చేష్టలే. అడిగిందే అడగడం, చెప్పిందే చెప్పడం మీతోని నాకు చావే వుంది" అంది విసుగ్గా రాజమ్మ. అక్కన్నుంచి వెళ్ళిపోబోయింది.

"పోతున్నవా? కొన్ని మంచినీళ్ళు తీసుకురా!" గద్దించినట్టన్నాడు బలరామయ్య.

"చేతగాకున్నా నామీదనయితే కోపం చూపు తావు. నేనేం చేతనయి ఉన్నానంటావా? నాకూ పుట్టెడు రోగాలు. మీ కంటె నాలుగైదేళ్ళు చిన్న కావచ్చు. నాకు నేను చూసుకోవాలా? మిమ్మల్ని చూడాలా? కాళ్ళు గుంజుతున్నయి. దమ్ము ఎగపో సుకొస్తుంది. చావన్నా నేను? చేతనయి చేతగాక చేస్తుంటే ఎగిరిపించవద్దివి" అంటూ కడుపులోంచి పొంగుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ మంచి నీళ్ళు తేవడానికి వంట గదిలోకెళ్ళింది రాజమ్మ. నీళ్ళు తెచ్చి బలరామయ్యకిచ్చి టాబ్లెట్ తీసిచ్చింది. టాబ్లెట్ వేసుకొని నీళ్ళు తాగాడు బలరామయ్య.

"ఏం జెయ్యాలి చెప్పు? నీ మీదికి కాకుంటే ఎవరి మీది కెగరాలి? ఎవరి మీది కెగిరితే ఎవరూర్కుం టారు? ఎంత బుద్ధిమంతుడు కొడుకు? ఎలా మారిపోయాడు? ఊళ్ళో, మంచి వాడెవరంటే ఎవ ర్నడిగినా సురేష్ పేరే చెప్పేవారు. వీడిందు కెలా మారిపోయాడు?" అన్నాడు బలరామయ్య.

"ఎలా మారిపోవడమేంటి? లోకమే అలా వుంది. పెళ్ళయితే చాలు పెండ్లాం బెల్లం, తల్లిదండ్రుల ల్లమై పోతున్నారు. దాని భ్రమలో పడిపోయాడు కొడుకు" అంది రాజమ్మ.

"అంతా వాళ్ళదే తప్పంటావు. నువ్వు కోడల్ని కాల్చుక తిన్నే. మాడ్చుక తిన్నే! వాళ్ళలా మారడానికి నువ్వే కారణం. మనమే కారణం. ముండ నువ్వే కారణం" అంటూ తిడ్తున్నాడు బలరామయ్య.

"మీరందరూ మంచివాళ్ళే. నేనే రాక్షసిని. ఎప్పుడో ఓసారి నూతిలపడి చావకుంటే నా పేరు రాజే కాదు" అంటూ అక్కన్నుంచి లేచిపోయింది రాజమ్మ.

తనతో పాటు వయసు భారాన్ని మోస్తూ కూడా తనకు సేవలు చేస్తున్న భార్యను తిడ్తున్నందుకు తనను తాను నిందించుకున్నాడు. మంచంలోంచి లేచి నిల్చున్నాడు. మంచం ప్రక్కనే వున్న కట్టె చేతిలోకి తీసుకున్నాడు. మెల్లమెల్లగా అడుగులేస్తూ అరుగుమీద మొగురాని కొరిగి కూర్చున్న భార్య దగ్గరికెళ్ళాడు. ఆమెకు కొంత దూరంలో కూర్చు న్నాడు.

"నా మనసు బాగుండటం లేదు. ఆరోగ్యం బాగుండటం లేదు. నేను ఇంకెంతో కాలం బతు కను. నేను తిట్టినా పట్టించుకోవద్దు. ఈ వయ సులో నీకు నేను, నాకు నువ్వు కాకుంటే మనకు దిక్కెవ్వలు చెప్పు?" అన్నాడు బలరామయ్య.

"కాదని ఎవరన్నారు? నేనవన్నీ పట్టించుకునే దాన్నయితే ఎప్పుడో నూతిలో పడి చచ్చేదాన్ని. మీకు చేసేవాళ్ళు లేరని బతుకుతున్నాను కాని నాకేం బ్రతుకాలని లేదు" అంది రాజమ్మ.

"సరేకాని సురేష్ రాడంటావా? మన పరిస్థితి ఇలా వుందని తెలిసి కూడా రాడంటావా?" అన్నాడు బలరామయ్య.

"వాడెందు కొస్తాడు? వానుద్యోగం.. పిల్లలు.. భార్య.. మనతో నేమవసరముంది వాడికి? ఎందు కొస్తాడు? వస్తే మన భారం మీద పడ్తుందని, ఇదో పీడని అనుకునుంటాడు. వచ్చే వాడైతే ఇది వరకే వచ్చేవాడు. రెండుత్తరాలు రాసాం. ఇద్దరు మనుషుల్తోని చెప్పి పంపాం" అంది రాజమ్మ.

"అంతే నంటావా?" బలరామయ్య అంటూ వుండగానే

"తాతా నీకుత్తరం" అంటూ పోస్టుమాన్ బలరా మయ్య చేతిలో ఇన్‌లాండ్ లెటరుంచి నిల్చున్నాడు.

"ఎక్కన్నుంచి ఉత్తరం.." అన్నాడు బలరామయ్య దాన్ని విప్పకుండానే.

"మీ సురేష్ రాసిండు.." అని వెళ్ళిపోయాడు పోస్టుమాన్.

"మంచం కింద అద్దాలున్నాయి తీసుకురా పో" అంటూ లేఖ చింపాడు బలరామయ్య. ఈలోగా రాజమ్మ అద్దాలు తీసుకొచ్చి బలరామయ్య కిచ్చింది. కళ్ళజోడు పెట్టుకొని ఉత్తరం తనలో తాను చదువుకుంటున్నాడు బలరామయ్య.

ఉత్తరం చదువుతున్న బలరామయ్య ముడతల ముఖంలో మరిన్ని ముడతలు పడుతున్నాయి. అతని ముఖంలో రంగులు మారుతున్నాయి.

పూజ్యులైన నాన్నగారికి–

నమస్కారములు...

వృద్ధాప్య భారంతో, అనారోగ్యంతో బాధపడ్తున్న మీకు ఈ ఉత్తరం రాయడం బాధాకరంగానే వుంది. కాని, తప్పడం లేదు. ఈ ఉత్తరం చదివి మీరు బాధ పడటమో, నాపై శాపనార్థాలు కురిపించడమో చేయడం కంటె ఒక్కసారి ఆత్మప్రక్షాళనం చేసు కొని ఆలోచిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. విజ్ఞులైన మీరు అలా చేస్తారనీ ఆశిస్తాను.

సంతానం పసివాళ్ళైనప్పుడు తండ్రిగా ప్రవర్తించాలి. కొడుకు యువకుడవుతుంటే స్నేహితునిగా చూసు కోవాలి. తండ్రి వృద్ధుడైతే కొడుకే తండ్రి పాత్ర తీసుకోవాలి. బాధ్యత తీసుకోవాలి. కాని, నేను ఆ పాత్రను తీసుకోవడం లేదు. పైగా మిమ్మల్ని పట్టించుకోవడం కూడా లేదు. ఇది ద్రోహమే. కాని

దీనివెనుకున్న కారణాలేంటో మీకు తెలుసు. ఆ కారణాల గూర్చే నేనిప్పుడు రాయబోయేది.

నాన్నా! మన కున్నదాంట్లో మీరు నన్ను బాగానే పెంచారు. చదువు విలువ తెలిసిన మీరు నన్ను చదివించారు. నేనంటే మీకెంత ప్రాణంగా వుండేదో, మీరంటే నాకంత కంటె ప్రాణంగా వుండేది. త్వరలోనే నాకుద్యోగమైంది. పెళ్ళి కూడా అయింది. అంతవరకు బాగానే జరిగింది. అటు తర్వాతే సమస్యలు మొదలయ్యాయి.

నా భార్య చదువుకున్న కుటుంబంలోంచి వచ్చింది. కొంత నాగరికంగా వుంటుంది. చెల్లెలు ఆర్థిక పరిస్థితి బాగానే వున్నా వ్యవసాయం చేసే కుటుంబంలోది కావడం వల్ల ఆమె మీకు కష్టపడుతున్నట్టనిపించింది. నా భార్యతో ఆమెను పోల్చడం ప్రారంభించారు. మీ కొడుకు సొమ్ముతో ఎక్కన్నుంచో వచ్చిన స్త్రీ సుఖపడుతున్నట్టు మీలో అభిప్రాయం కల్గింది. అది మీలో విషబీజంగా ఎదిగింది. నా భార్య మీకు శత్రువుగా కనబడింది. ఆమెతో పాటు నిజాలను మాట్లాడే నేనూ మీకు శత్రువుగానే కనబడ్డాను. అమ్మకు, నా భార్యకు మధ్య సఖ్యత చేకూర్చే ప్రయత్నంలో నేను మీకు దూరమయ్యాను. క్రమక్రమంగా మన మధ్య దూరం పెరుగ సాగింది. ఉద్యోగ రీత్యా దూర ప్రాంతంలో వుండటంవల్ల ఆ దూరం మరింత పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకొని ఊళ్ళోనే వున్న చెల్లెలు, బావ కుటుంబం మీకు మరింత దగ్గరైంది. మన మధ్య దూరం పెరగడానికి మరింత దోహదమైంది.

ఆడవాళ్ళ మీది కోపంతో నామీద కూడా కోపం పెంచుకున్నారు. ఇంటికొస్తున్నా రావడం లేదని అందరికీ చెప్పారు. డబ్బులిస్తున్నా ఇవ్వడం లేదన్నారు. మిమ్మల్ని బాగానే చూసుకుంటున్నా నిర్లక్ష్యం చేస్తున్నాడని ప్రచారం చేశారు. మనకున్న భూములపై ఆదాయం బాగానే వున్నా అప్పులవుతున్నాయన్నారు. అప్పులెందు కవుతున్నాయంటే నన్ను బూతులు తిట్టారు. మీరిద్దరు బ్రతకడానికి ఆ భూములపై వచ్చే ఆదాయం సరిపోవడం లేదని భూములమ్మడం మొదలుపెట్టారు. నేనెంత ప్రతిఘటించినా వినలేదు. మీ బాధ్యతను నేను తీసుకుంటానన్నా వినలేదు. భూములన్ని అమ్ముడుపోతున్నా మిమ్మల్ని కష్టపెట్టకూడదనే ఊర్కున్నాను. అయినా తల్లిదండ్రులను చూడని కర్కోటకుడిగా నన్ను ప్రచారం చేశారు. ఓ దిక్కు మన ఆస్తి తగ్గుతుంటే బావ ఆస్తి పెరిగింది. చాలా కాలం డబ్బు పంపి దానివల్ల ఫలితం లేదని పంపడం మానాను. ఇంటికి రావడం కూడా తగ్గించాను. తీరికోసారి నేనే వస్తున్నాను కాని మూడునాలుగేళ్ళుగా మీరు నా ఇంటికే రావడం లేదు. నాకు కూతురు పుట్టినా, మూడేళ్ళు దాటినా మీరు చూళ్ళేదు.

ఇప్పుడు నేనెందుకు మీకు జ్ఞాపకం వచ్చాను. నన్నెందుకు మీ బాధ్యత తీసుకొమ్మంటున్నారు? నాకు సంక్రమించాల్సిన తాత ఆస్తిని మామీది కోపంతో బావకు అమ్మిచ్చారు. ఇప్పుడు ఉన్న దాంతో వెళ్ళే పరిస్థితి లేదు. కాబట్టి కొడుకు జ్ఞాపకం వచ్చాడు.

నాన్నా! నే నొకప్పుడు శ్రీరామ చంద్రున్నే. మీ మాట జవదాటని వాన్నే. కాని నాకున్న ఈ చిన్న ఉద్యోగంతో మీకివ్వడం తప్ప తాత ఆస్తిగూర్చి అడగవద్దంటే సాధ్యం కాదు. జరిగిందేదో జరిగిపోయింది. కొడుకుగా మీ బాధ్యత నాదే. ఇన్ని రోజులు మీ ఆస్తి తిన్నవాళ్ళు చూడకున్నా ఫర్వాలేదు. కాని, ఇప్పటికైనా మిగిలింది అప్పైనా, కుప్పైనా నాకప్పజెప్పి మీ బాధ్యత స్వీకరించమని చెప్పండి. ఇప్పుడున్న దాన్నయినా మీ ఇష్టమున్నట్టు వాడుకుంటానంటే వాడుకోండి. నేను మీ బాధ్యత స్వీకరించాలంటే మాత్రం మిగిలిందైనా నాకప్పగించాలి. ఏ నిర్ణయం తీసుకున్నా మీ ఇష్టమే.

లేఖ రాయండి.

మీ పుత్రుడు
సురేష్.. ..

లేఖ చదవడం పూర్తిచేసిన బలరామయ్య కళ్ళవెంట పటపటా నీళ్ళు కారుతున్నాయి. కడుపులోంచి దుఃఖం ఎగజిమ్ముకు వస్తుంది. వెక్కివెక్కి ఏడుస్తున్నాడు బలరామయ్య. విషయమేంటో అర్థం కాక 'రాజమ్మ' ఆశ్చర్యపోతుంది. బలరామయ్యను దగ్గరకు తీసుకొని ఓదార్చింది. కొద్ది నిమిషాల్లో ఊర్కొని కళ్ళు తుడుచుకున్నాడు బలరామయ్య. ఉత్తరంలో ఏముందని అడిగింది రాజమ్మ. మరోసారి చదివి వినిపించాడు బలరామయ్య.

"అయ్యో! అయ్యో! నా రాత పాడుగాను. ఇటువంటి కొడుకెవరికైనా వున్నాడా? ఉన్నదంతా బిడ్డకే పెట్టానా? పెండ్లాం మాటిని నాకు దూరమైండు కొడుకు. కడుపులో పెట్టుకొని సాదుకున్న కొడుకును" అని ఏడ్వసాగింది రాజమ్మ.

"ఊర్కో.. ఏడుస్తున్నావింక. బిడ్డ బిడ్డని కొడుకును నాకు గాకుండ జేసినవు. నోర్మూయ్" అన్నాడు గద్దరిస్తూ బలరామయ్య.

రాజమ్మ ఏడ్పు విని బజారువెంట పోతున్న రాంరెడ్డి వచ్చి వాకిట్లో వాల్చున్న మంచంలో కూర్చున్నాడు. బలరామయ్య మిత్రుడు నందయ్య కూడా వచ్చి రాంరెడ్డి ప్రక్కన కూర్చున్నాడు.

# చౌరస్తా

ఇదే చౌరస్తా
ఇక్కడ చీలుతూ పోతూన్న దారుల్లో
నీ దారిని నువ్వే ఎంచుకోవాలి
నీ గమ్యాన్ని నువ్వే నిర్ణయించుకోవాలి

కరెన్సీ నోట్ల కట్టలతో, ఖాదీబట్టల గుట్టలతో
కుర్చీలు కుర్చీలుగా సాగుతూ
కులాసాల్లోకి డబ్బు తెచ్చే విలాసాల్లోకి
దారితీస్తూ ఒక తోవ...

కష్టలతో, కలహాలతో
కులమతాల కుళ్ళుతో అరాచకాల ముళ్ళతో
దహించుకుపోతూన్న మానవత్వం కేసి
దారితీస్తూ ఒక తోవ...


అవినీతితో, అబద్ధాలతో
అక్రమార్జనల ఆకాశ హర్మ్యాలతో
అంతులేని ఆశలకేసి
దారితీస్తూ ఒక తోవ...
ప్రేమాభిమానాలతో, శాంతి సామరస్యాలతో
పుష్పించిన స్నేహపు గుబాళింపులతో
సౌహార్ద్ర హృదయాల్లోకి...
మనుషుల్లా జీవించే మనుషుల మధ్యకి
దారితీస్తూ ఒక తోవ...

ఇప్పుడు ఏ తోవలో పోవాలో
ఏ గమ్యం చేరుకోవాలో
నీకు నువ్వే నిర్ణయించుకోవాలి

కరెన్సీ నోట్ల కట్టల్లోకి, ఖాదీబట్టల గుట్టల్లోకి
దారితీసి డబ్బుతెచ్చే విలాసాలకేసి సాగిపోతావో
కులమతాల కష్టల్లో కాలిపోతావో
అబద్ధాలతో, అక్రమార్జనల్తో నిర్మించుకున్న
ఆకాశ హర్మ్యాల కోసం ఆశపడిపోతావో...

పట్టభద్రత నిన్ను వదిలేసిన
ఈ చౌరస్తాలోనే తేల్చుకోవాలి
నిన్ను నువ్వు ప్రశ్నించుకుని మరీ
నీ తోవ నువ్వు ఎంచుకోవాలి
నీ గమ్యం నువ్వు నిర్ణయించుకోవాలి
నువ్వు మనిషివో కాదో తేలిపోయేది యిక్కడే

— పన్యాల జగన్నాథ్ దాస్



"ఏమైందమ్మా.. ఏమైంది?" అన్నాడు రాంరెడ్డి.

ఉత్తరం రాంరెడ్డి కిచ్చాడు బలరామయ్య. తనలో తాను చదువుకున్నాడు రాంరెడ్డి.

"నేను చెప్పలేదా? ఆడవాళ్ళ మాటలు విని అలా చేయొద్దురా అంటే విన్నావా? ఇప్పుడు చూడేమైందో? అటు అన్నాచెల్లెల్ల మధ్య విరోధాన్ని పెంచావు. ఇటు కొడుకును నీకు కాకుండా చేసుకున్నావు. డబ్బు మనుషుల్ని నాశనం చేస్తుంది. వాడన్న దాంట్లో తప్పేముంది చెప్పు" అన్నాడు రాంరెడ్డి.

"అందరూ మమ్మల్నే అనండి పటేల..! కోడలుకు మా పొడంటేనే గిట్టక పాయె. ఆపదల, సంపదల అన్నిట్లో బిడ్డే ఆదుకుంటుంది. అదే తింటది. అదే పారేస్తది మమ్ముల్ని. నా బిడ్డ తింటంది తింటందన్నరు ఏం తిన్నదది?" అంది కండ్లు తుడుచుకుంటూ రాజమ్మ.

నందయ్య కూడా ఆ లేఖ చదివి బలరామయ్య కిచ్చాడు.

"ఎంతైనా కాలం మునుపట్లా లేదు. ఆస్తి ఇస్తేనే చూస్తానంటున్నాడు కొడుకు. కొడుక్కు ఆస్తి కాకుండా చేస్తానంటున్నాడు తండ్రి.. అప్పుడే ఎంతో కొంత చదువుకున్నాడు బలరామయ్య. అయినా ఏం చేసాడో చూడండి. సురేష్ కూడా బాగా చదువుకున్నవాడే. తండ్రి కొడుకు లిద్దరూ తెలివికలవాళ్ళే. వడిగల గుర్రానికి తిరుగుడు రోగ మన్నట్టు వీళ్ళెలా చేస్తున్నారో చూడండి" అన్నాడు నందయ్య.

బలరామయ్యా మాటలకు తలవంచుకున్నాడు.

"ఇప్పుడేమైంది? ఇంత కాలం నడిచినట్టే నడుస్తుందేంటి?" అన్నాడు రాంరెడ్డి.

"అందులోనే వుంది పటేలా అసలు కిటుకు. చాతనైనన్ని రోజులు నాకేం బిసాయిదని మా ఎగిరాడు బలరామయ్య. ఇప్పుడు చేతగాకుంటైంది. పేగు బొర్లింది. కొడుకు పిల్లలను చూసుకోవాలన్న ఆరాటం పెరిగింది. చేతుల్లో డబ్బున్నప్పుడు జ్ఞాపకం రాని కొడుకు చేతగాకుండా అయింతర్వాత జ్ఞాపకమొస్తున్నాడా అని ఇపుడు కొడుకు బిగుసుకుంటున్నాడు" అన్నాడు నందయ్య.

"ఇందులో ఇద్దరిది తప్పంది తియ్యి" అన్నాడు రాంరెడ్డి.

"ఎంతైనా కాలం మంచిగ లేదే.. ముసులోల్లు బతికే కాలం గాదిది. నౌకరి చేసే కొడుకు దగ్గరకు పోయిన తల్లిదండ్రులను మెడలు పట్టి నూకిందట గోపాల్రెడ్డి కోడలు.. కంటి కోధారేడ్సుకుంట వచ్చిండ్రు" అన్నాడు అప్పుడే వచ్చి అక్కడ కూర్చున్న రాజం..

"లంగలు రెండు దిక్కులున్నారు. అటు ముసలోల్లలో వున్నారు. ఇటు యువకుల్లో వున్నారు. ఎంత బాగా చూసుకున్నా కొడుకు కోడల్ను రాచి రంపాన పెట్టేవాళ్ళున్నారు" అన్నాడు రాంరెడ్డి.

"ఈ ఆస్తే లేకుంటే ఏం చేసేవాడట సురేష్" అన్నాడు రాజం.

"అదే మాట నేనొసారన్నాను. నాన్నతో కిల్లీ కొట్టో, మరోటో పెట్టించే వాన్నన్నాడు. ఈ కాలపు పిల్లలకు చెప్ప వచ్చేట్టుందా? తాము మాత్రం తల్లిదండ్రులకు ఏమివ్వదలుచుకోలేదు" అన్నాడు నందయ్య.

"పిల్లలేంది పిల్లలు? సురేషింకా పిల్లవాడా? నలభయేండ్లున్నాయనుకుంటా.. అయినా మన తరంలో ఉన్న ప్రేమలు, ఆప్యాయతలు ఈ తరం వాళ్ళకు లేవు" అన్నాడు రాంరెడ్డి.

"ముసలివాళ్ళది కొంత తప్పున్నా ఈ కాలంలో ముసలివాళ్ళు బ్రతకడం కష్టమే. ఎంతమంది ముసలివాళ్ళు ఇండ్లలో బిక్కు బిక్కుమనుకుంటున్నారో మనకు తెలియదా? నౌకర్లు చేస్తూ వాళ్ళకు వాళ్ళు.. ఒంటరిగా ఊళ్ళో ముసలివాళ్ళు చేతగాకుండా అయితే ముసలివాళ్ళు చనిపోయిందే మంచిది" అన్నాడు రాజం.

ఆ మాటలకు అక్కడున్న వాళ్ళ హృదయాలన్నీ భారమయ్యాయి.

"ఇలాంటి సమస్యలెక్కువగా మధ్యతరగతి కుటుంబాల్లోనే వుంటున్నాయి. అటు బాగా ఉన్న వాళ్ళలో పిల్లలు పట్టించుకోకున్నా డబ్బు మాటున అణిగిపోతాయి. కింది స్థాయి కుటుంబాల్లో పూర్తి చేతగాకుండా అయ్యేంతవరకు ముసలివాళ్ళైనా పని చేస్తూనే వుంటారు. వాళ్ళకు కొడుకులు పెద్దగా పెట్టేదేముండదు. ఎటొచ్చీ మధ్యతరగతి ముసలివాళ్ళు తాము కనిపెంచిన కొడుకులు తమను బాగా చూసుకోవాలని ఏవేవో కోరుకుంటారు. వృద్ధాప్యం అదో వరమైనట్టు, తమకు సేవ చేయడం కొడుకుల బాధ్యతైనట్టు ప్రవర్తిస్తుంటారు. అక్కడే వస్తుంది చిక్కు. మరో దిక్కు చదువుకున్న కొడుకులు, కోడల్లు.. చదువురాని తల్లిదండ్రులు. వీళ్ళ మధ్య అంతరాలు బేధాల్ని పెంచుతాయి" అన్నాడు రాంరెడ్డి.

"చాలా బాగా చెప్పావు పటేలా?" అన్నాడు రాజం.

"ఏం బలరామయ్య ఏం మాట్లాడవేంటి?" అన్నాడు రాంరెడ్డి.

"ఏం మాట్లాడాలి పటేల? నా రాతెలా వుంటే అలా అవుతుంది. మనం అనుకున్నట్టవుతాయా నాకు చేతనవుత లేదు. పడుకుంటాను" అని లేచి కట్టె తీసుకొని మెల్ల మెల్లగా నడుస్తూ ఇంట్లోకెళ్ళి మంచంలో పడుకున్నాడు బలరామయ్య.

వాళ్ళంతా లేచి వెళ్ళిపోయారు.

ఎంత ప్రయత్నించినా బలరామయ్యకు నిద్ర పట్టం లేదు. తను చేసిన తప్పులు, తీసుకున్న నిర్ణయాలాతన్ని వెంటాడుతున్నాయి. కొడుకు రాసిన వాక్యాలతని కళ్ళముందు కదులుతున్నాయి.

'ఎంతో మందికి వృద్ధాప్యం శాపమవుతుంది. చాలామంది వృద్ధులు పిల్లల నిర్లక్ష్యానికి గురవుతూ దీనాతిదీనంగా బతుకుతున్నారు. తాను కూడా అలాగే బతకాల్సొస్తుందా? తన కొడుక లాంటి వాడు కాదు. ఇది తన స్వయంకృతం. ఇద్దర్నీ రెండు కళ్ళుగా చూసుకోవాల్సింది తాము విచక్షణ చూపారు. ఒకర్ని దూరం చేసుకున్నాం. ఈ వృద్ధాప్యంలో అల్లుడు తనకు సేవ చేస్తాడా? మరి కొడుకునే ముఖం పెట్టుకొని తన బాధ్యతలను స్వీకరించమనాలి? ఉత్తరంలో తాను స్వీకరిస్తానన్నా ఇన్నాళ్ళుగా జరిగిన సంఘటనలను కోడలు ఎత్తిచూపకుండా వుంటుందా? తమను సూటిపోటి మాటల్తో బాధించకుండా వుంటుందా? కొడుకు క్షమించినా కోడలు తనను క్షమిస్తుందా? అయితే

తానిప్పుడేం చేయాలి? ఏం చేయాలి?' రకరకా లుగా ఆలోచిస్తున్నాడు బలరామయ్య. అతనిలో ఎన్నో ప్రశ్నలు.

"మాకు చాతగాకుండా అయితే ఇంత విషం తాగి చస్తాం. మా పిల్లలతో ఎత్తిపోయించుకోం" రాజవేరుతో తన కోడలన్న మాటలు బలరామయ్య చెవుల్లో గింగురు మంటున్నాయి.

అతని కడుపు నిండా దుఃఖముంది. కొడుకు పిల్లల్ని ఒక్కసారి చూస్తే బాగుండుననిపిస్తుంది. అయినా తన కోర్కెను బలవంతంగా అణుచుకున్నాడు బలరామయ్య. రకరకాలుగా తర్జన భర్జన చేసుకున్నాడు. ఓ నిర్ణయానికొచ్చాడు.

ఇన్‌లాండ్ లెటర్ తెప్పించాడు.

వణికే చేతులతో కొడుక్కు నాలుగు వాక్యాల్లో ఉత్తరం రాయడం ముగించాడు. దాన్నెవరికీ చూప కుండా మెతుకుల్తో అతికేశాడు. పోస్టు బాక్సులో వేయించాడు. ఇప్పుడాతనికి ప్రశాంతంగా వుంది.

XX XX XX

"ఇప్పుడెందు కండీ వేములవాడ వెళ్ళడం? మీకి మువరకే చేతకాకుండా వుంది" నాలుగవసారి బల రామయ్య ప్రయత్నాన్ని వారించ ప్రయత్నించింది రాజమ్మ.

"నేను పోవాలనుకుంటున్నాను. పోతాను. నీ ఇష్టముంటే నాతోరా లేదా నేనొక్కన్నే పోతాను. బిడ్డ, నువ్వు ఎవ్వరు రాకున్నా మంచిదే" ఖచ్చి తంగా చెప్పాడు బలరామయ్య.

రాజమ్మ కిక బయల్దేరక తప్పలేదు.

కూతుర్ని వెంటబెట్టుకొని రాజమ్మ, బలరామయ్య సాయంత్రం వరకు వేములవాడ చేరుకున్నారు. ఓ గదిని అద్దెకు తీసుకొని ఆ రాత్రి పడుకున్నారు. తెల్లవారి దొడ్డికెళ్ళి, ముఖం కడుక్కున్న తర్వాత కోనేటిలో స్నానం చేయడానికెళ్దామన్నాడు బలరామయ్య. బయట స్నానం చేసి గుండం లోని నీళ్ళు చల్లుకుంటే సరిపోతుందన్నది రాజమ్మ. కోనేటిలో స్నానం చేయాల్సిందేనని పట్టుబట్టాడు బలరామయ్య. కూతురు చెప్పినా విన్లేదు. కోనేట్లో స్నానం చేయడానికి ముగ్గురూ బయల్దేరారు. నడవడమే అతికష్టంగా వున్న బలరామయ్యకు మెట్లు దిగడం మరింత కష్టమవుతుంది. వద్దని చెప్పినా వినకుండా కూచొని మెట్లపై నుండి జారుతూ తొడలబంటి నీట్లో కెళ్ళాడు. ఆతనితో పాటు కూతురు వెళ్ళింది.

శివున్ని ధ్యానం చేస్తూ నీళ్ళలో మునుగుతున్నాడు బలరామయ్య. మూడవసారి మునిగిన వాడు మళ్ళీ బయటకు రాలేదు. బలరామయ్య కూతురు, రాజమ్మ లబొదిబో మొత్తుకోసాగారు. ఎక్కన్నుంచి వచ్చాడో సురేష్ గబగబా వచ్చి నీట్లో మునిగాడు. తండ్రిని చేతుల్లో పట్టుకొని బయటకు తీసుకొచ్చాడు. అక్కడున్న వాళ్ళంతా కలిసి నీళ్ళు కక్కించారు.

తనకు సమీపంలోనే కోడల్ని, పిల్లల్ని చూసిన బలరామయ్య ముఖంలో చెప్పలేని ఆనందం.

"నాన్నా! మీ ఉత్తరం చూసి మీరేం చేయబోతున్నారో అర్థం చేసుకున్నాను. నిన్న రాత్రివరకింటికి చేరుకున్నాను. ఇక్కడికొచ్చారని తెలుసుకొని తెల్ల వారక ముందే బయలుదేరాను. నాకు ఉత్తరం అందడం ఆలస్యమైనా, నేనిక్కడికి రావడంలో కొంత ఆలస్యం జరిగినా మీరు దక్కి వుండేవారు కాదు" అన్నాడు కళ్ళనీళ్ళు తీసుకుంటూ సురేష్.

దుఃఖభారంతో వున్న ఎవరూ ఏం మాట్లాడలేదు.


"నాన్నా! వార్ధక్యం అటు ముసలివాళ్ళకు శాపం కాకూడదు. ఇటు పిల్లలకు భారం కాకూడదు. ఆ పరిస్థితుల్ని తెచ్చుకోకూడదు" అని తండ్రిని కూచోబెట్టాడు సురేష్.

"నువ్వు నాకు కొడుకువు కాదు బాబూ! తండ్రివి. ఈ రోజు నుంచి నేనే నీ కొడుకును. నీవు నాకు తాత. ఇది అమ్మమ్మ" అంటూ మనవన్ని, మనవరాలిని దగ్గరకు తీసుకున్నాడు బలరామయ్య.

## మరణ వాఙ్మూలం

ఇక్కడ అందరూ వున్నారు
ఒక్కడూ ఆర్తిని ఆదుకున్న దాఖలా లేదు
ఒక్క సూర్యుడు కోటి సూర్యులుగా మారి
ఇంటింటా వెలుగు భోజనం వడ్డిస్తున్నా
స్ఫూర్తి పొందినదృష్టాంతమూ లేదు!
ఇక్కడ అందరూ వున్నారు
చెరబట్టిన చెరసాల వుంది
స్వారీ చెయ్యలేని నీతి
నిజాయితీగా కిందపడి
అశ్వం గిట్టల కింద నలిగిపోయింది
అంబారీ ఎక్కలేని న్యాయం
ధర్మ పథాన
ఏనుగు పాదాల కిందభూస్థాపితమైంది!
నన్ను నేను వెంబడిస్తున్నాను
నన్ను నేను తరుముకుంటున్నాను
నన్ను నేను సమాధి చేసుకుంటున్నాను
నా మరణానికి నేనే బాధ్యుణ్ని
ఇది నా సొంతదస్తూరి!
శత సహస్ర నేత్రాలు చూస్తున్నాయి
అన్నీ కాటరాక్ట్ కన్నులయ్యాయి
నా మరణం చరిత్ర కాదు

మరణాన్ని చూసిన శత సహస్ర నేత్రాలదే చరిత్ర
శత సహస్ర నేత్రాలు చూపుకోల్పోవడమే చరిత్ర
మట్టికీ గుండె వుంది
మట్టిగుండె మరమ్మతుకు కార్డియాలజిస్టులూ వున్నారు
ఓడను ముంచడానికి సముద్రం వుప్పొంగితే
ఉప్పొంగినా మునగని ఓడ తయారంవుతుంది!



— అడిగోపుల వెంకటరత్నం